ఎంపిల నోరు నొక్కుతారా?

పదాల నిషేధంపై ప్రతిపక్షాల ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సాధారణంగా వాడుకలో ఉన్న పదాలను కూడా అన్‌పార్లమెంటరీ జాబితాలో చేర్చడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. ఇది పార్లమెంటు సభ్యులపై గ్యాగ్ ఆర్డర్ లాంటిదని విమర్శించాయి. గ్యాగ్ ఆర్డర్ అంటే పార్లమెంటులో సభ్యులు మాట్లాడే భాష ఇలానే ఉండాలి. ఇంకొక విధంగా ఉండడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేయడమే. అన్‌పార్లమెంటరీ పదాల జాబితాను పెంచుకుంటూ పోవడం సభ్యుల భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగకరమని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ చర్యను కాంగ్రెస్, సిపిఐ(ఎం), టిఎంసి, శివసేన తదితర పార్టీలు వేర్వేరు ప్రకటనల్లో విమర్శించాయి. కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ "ఇప్పుడు పదాలపై నిషేధం విధించారు. రేపు కాషాయ దుస్తులు ధరించినవారికే సభలో ప్రవేశం అని కూడా ఆంక్షలు పెట్టినా ఆశ్చర్య.పోనక్కర్లేదని అన్నారు. "ఇదేం పని విశ్వగురూ?" అని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ దెప్పి పొడిచారు. ఇది ఎంపీలపై గ్యాగ్ ఆర్డర్ అని టిఎంసి నాయకుడు డెరెక్ ఓబ్రియాన్ వ్యాఖ్యానించారు. ఇది ప్రజల నోరు మూయించడమేనని సిపిఎం ఎంపి వి.శివదాసన్ విమర్శించారు. దాదాపు 65 పదాలు నిషేధించడం అత్యంత హాస్యాస్పదమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.

పదాలను నిషేధించలేదు : ఓం బిర్లా, లోక్‌సభ స్పీకర్

అన్‌పార్లమెంటరీ పదాలంటూ కొన్ని పదాలను నిషేధిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ విడుదల చేసిన జాబితాలో తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో వెనక్కి తగ్గింది. ఉభయ సభల్లో తాము ఏ పదాన్నీ నిషేధించ లేదని లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా తెలిపారు. ఇలాంటి అన్‌పార్లమెంటరీ పదాలతో కూడిన ఓ పుస్తకాన్ని విడుదల చేశారని, పేపర్లను వృథా చేయొద్దన్న ఉద్దేశంతో వాటిని ఇంటర్నెట్‌లో పెట్టామన్నారు. తామైతే ఏ పదాలను నిషేధించలేదని, తొలగించిన పదాల సంకలనాన్ని తాము విడుదల చేస్తామని ఓం బిర్లా తెలిపారు. "అన్ పార్లమెంటరీ పదాలతో కూడిన 1,100 పేజీలున్న ఆ పుస్తకాన్ని వారు (ప్రతిపక్షాలు) చదివారా? వారు దానిని చదివి ఉంటే ఈ అపోహలు వ్యాప్తి చేసేవారు కాదు. 1954, 1986, 1992, 1999, 2004, 2009, 2010లో ఈ బుక్‌లెట్ విడుదలైంది. 2010 నుంచి వార్షిక ప్రాతిపదికన విడుదలవుతోంది" అని స్పీకర్ పేర్కొన్నారు.

పార్లమెంట్ రికార్డుల్లో 65 పదాల తొలగింపు

- అవినీతి, జుమ్లాజీవి అన్‌పార్లమెంటరీ పదాలే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం చివరికి పార్లమెంటు సభ్యులు మాట్లాడేటప్పుడు వాడే పదాలనూ నియంత్రించాలని చూసింది. అవినీతి, జుమ్లాజీవి వంటి 65 పదాలను 'అన్‌పార్లమెంటరీ' (పార్లమెంటులో ఉపయోగించకూడని పదాలు) జాబితాలో చేర్చుతూ లోక్‌సభ సెక్రటేరియట్ తాజాపరచిన బుక్‌లెట్ పేరుతో విడుదల చేసింది. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా అలాంటిదేమీ లేదని సర్ది చెప్పే యత్నం చేశారు. ఎంపిలపై ఇది గాగ్ ఆర్డరేనని ప్రతిపక్షాలు ఆగ్రహించాయి. ఈ బుక్‌లెట్‌లో అన్‌పార్లమెంటరీ పదాల జాబితాలో జుమ్లజీవి, బాల్ బుద్ధి, కోవిడ్ స్ప్రెడర్, స్నూప్‌గేట్ వంటి 63 పదాలను చేర్చారు. సాధారణంగా ఉపయోగించే సిగ్గు, దుర్వినియోగం, ద్రోహం, అవినీతి, నాటకం, వంచన, అసమర్థుడు వంటివి అన్‌పార్లమెంటరీ జాబితాలో ఉన్నాయి. అవే కాదు, అరాచకవాది, శకుని, నియంతృత్వం, తానాషా, తానాషాహి, జైచంద్, వినాష్ పురుష్, ఖలిస్తానీ, ఖూన్ సే ఖేతీ, ద్రోహ చరిత్ర, నికమ్మ, నౌతంకి, దిండోరా, పిరికివాడు, నేరస్థుడు, మొసలి కన్నీరు, రక్తపాతం,మోసం, చంచాగిరి, పిల్లచేష్టలు, గాడిద, కళ్లజోడు, పోకిరి, కపటత్వం మూర్ఖుడు, బెహ్రీ సర్కార్, లైంగిక వేధింపులు వంటి పదాలను వంటి పదాలు కూడా అన్‌పార్లమెంటరీ కింద చేర్చారు.

హైకోర్టు జడ్జి, న్యాయవాదులపై కోర్టు ధిక్కార చర్యలకు నో

న్యూఢిల్లీ : సస్పెండ్ అయిన బిజెపి నేత నూపుర్ శర్మపై మౌఖికంగా వ్యాఖ్యలు చేసినందుకు సుప్రీంకోర్టును విమర్శించిన ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.ఎన్.ధింగ్రా, మరో ఇద్దరు సీనియర్ న్యాయవాదులపై క్రిమినల్ ధిక్కార చర్యలు చేపట్టడానికి అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ తిరస్కరించారు. జస్టిస్ ధింగ్రా, సీనియర్ న్యాయవాదులు అమన్ లేఖి, కె.రామకుమార్‌లు చేసిన ప్రకటనలు "విచారణపై చేసే న్యాయమైన వ్యాఖ్యల పరిధిలో" వున్నాయని వేణుగోపాల్ పేర్కొన్నారు. వారి ప్రకటన విషపూరితమైన దాడిగా లేదా దుర్వినియోగం చేసే రీతిలో లేదని తెలిపారు. పైగా సుప్రీం కోర్టు న్యాయ పాలన పరిధిలో జోక్యం చేసుకునే రీతిలో కూడా లేదని పేర్కొన్నారు. కోర్టు ధిక్కార చర్య చేపట్టడానికి తన అనుమతి కోరిన న్యాయవాది జయ సుకిన్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. "మీ లేఖలో పేర్కొన్న ముగ్గురు వ్యక్తులు దురుద్దేశంతో, న్యాయ వ్యవస్థను తప్పుపట్టే ప్రయత్నంతో విమర్శించారని నేను భావించడం లేదు." అని పేర్కొన్నారు. అందువల్ల వారిపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టడానికి అనుమతించబోనని స్పష్టం చేశారు.

20 వేలు దాటిన కోవిడ్ కేసుల సంఖ్య

ఢిల్లీ : దేశంలో గత కొన్ని నెలలుగా 20 వేల లోపు నమోదవుతూ వచ్చిన కరోనా కేసుల సంఖ్య తాజాగా 20 వేలను దాటింది. మహారాష్ట్రతోపాటు పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరుగుతోంది. కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వశాఖ గురువారం ఉదయం విడుదల చేసిన వివరాల ప్రకారం గత 24 గంటల్లో దేశంలో కొత్తగా 20,139 కేసులు నమోదయ్యాయి. 38 మంది మరణించారు. 16,482 మంది కోవిడ్ బారి నుంచి బయటపడ్డారు. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 1,36,076కు చేరింది. పాజిటివిటీ రేటు 5.10 శాతానికి చేరింది. కరోనా వల్ల ఇప్పటి వరకు 5,25,557 మంది మరణించగా, 4,30,28,356 మంది కోవిడ్ బారినపడి మళ్లీ రికవరీ అయ్యారు. దేశంలో ఇప్పటివరకూ 199,27,27,559 డోసుల వ్యాక్సినేషన్ అందించింది. బుధవారం 13,44,714 మందికి టీకా ఇచ్చారు.

ఆసుపత్రిలో చేరిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కోవిడ్ బారిన పడ్డారు. ఈ నెల 12న ఆయనకు పాజిటివ్ అని తేలగా.. చెన్నై ఆళ్వార్ పేటలో ఉన్న కావేరీ ఆసుపత్రిలో స్టాలిన్ చేరినట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటన విడుదల చేశాయి.

మెహుల్ చోక్సీపై సిబిఐ కొత్త కేసు

ముంబయి : బ్యాంక్‌లను వేల కోట్లకు మోసం చేసి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారీ మెహుల్ చోక్సీపై సిబిఐ కొత్త ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. ఈ ఆర్థిక నేరగాడు కెనరా బ్యాంక్ నేతత్వంలోని కన్సార్టియంను రూ. 55.27 కోట్లకు ముంచినట్లు నూతన కేసులో పేర్కొంది. బెజెల్ జ్యువెలరీకి కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలు వర్కింగ్ క్యాపిటల్‌గా రూ.30 కోట్లు, రూ.25 కోట్లు మంజూరు చేశాయి. ఈ సంస్థలో ప్రధాన ప్రమోటర్లుగా ఉన్న చోక్సీతో పాటు, చేత్నా ఝువేరి, దినేష్ భాటియా, మిలింద్ లిమాయేలతో సహ బెజెల్ జ్యువెలరీ ఫుల్ టైం డైరెక్టర్లపై కూడా కేసు నమోదు చేసింది.

ఎన్ఎస్ఇ మాజీ చీఫ్ చిత్ర రామకృష్ణ అరెస్ట్

ముంబయి : మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్ఎస్ఇ) మాజీ సిఇఒ చిత్ర రామకృష్ణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం అరెస్ట్ చేసింది. అనంతరం ప్రత్యేక సిబిఐ కోర్టులో హాజరుపరిచింది. కోర్టు ఆమెను నాలుగు రోజుల ఇడి కస్టడీకి ఆదేశించింది. చిత్ర రామకృష్ణ, ముంబయి మాజీ పోలీస్ కమిషనర్ సంజయ్ పాండే, ఎన్ఎస్ఇ మాజీ అధిపతి రవి నారాయణ్‌లపై ఇడి మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసును నమోదు చేసింది.

పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించిన మహారాష్ట్ర

ముంబయి : మహారాష్ట్రలో కొత్తగా ఏర్పడిన షిండే ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలపై వ్యాట్‌ను తగ్గించింది. లీటర్ పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 తగ్గిస్తూ, మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. ముంబయిలో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ రూ.111.35 కాగా, వ్యాట్ తగ్గింపుతో ఇప్పుడది రూ.106.35కి లభించనుంది. రూ.97.28గా ఉన్న డీజిల్.. రూ. 94.28కే లభ్యం కానుంది.

జుబేర్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : జర్నలిస్టు, ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకులు మహమ్మద్ జుబేర్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఢిల్లీ కోర్టు గురువారం రిజర్వ్‌లో ఉంచింది. జుబేర్ గతంలో చేసిన ట్వీట్ల ఆధారంగా ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. జుబేర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గురువారం జుబేర్ తరపు లాయర్, ఢిల్లీ పోలీసుల వాదనలు విన్న అడిషనల్ సెషన్స్ జడ్జి దేవేంద్ర కుమార్ జంగాల తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. ఈ నెల 2న జుబేర్ బెయిల్ పిటిషన్‌ను మేజిస్ట్రీరియల్ కోర్టు తిరస్కరించింది. జుబేర్‌ను 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపింది.

ఉత్తరప్రదేశ్ పోలీసులు తనపై నమోదుచేసిన ఆరు కేసుల్ని కొట్టి వేయాలని జుబేర్ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇదే వివాదంపై ఉత్తరప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాల్లో తనపై కొత్త కేసులు నమోదు చేయకుండా ఆదేశాలివ్వాలని జుబేర్ తన పిటిషన్‌లో కోరారు. గురువారమే జుబేర్‌పై ఉన్న కేసుల్ని విచారించడానికి ఉత్తరప్రదేశ్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. సీతాపూర్‌లో నమోదైన కేసులో జుబేర్‌కు మధ్యంతర బెయిల్‌ను మంగళవారం సుప్రీంకోర్టు పొడిగించింది. ఇతర కేసుల కారణంగా జుబేర్ ఇంకా జైలులోనే ఉన్నారు.

ఉగ్రవాద కుట్ర కేసులో ఇద్దరి అరెస్టు

పాట్నా : బీహార్‌లో అనుమానిత ఉగ్రవాద కుట్రను పోలీసులు చేధించారు. ఉగ్రవాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ)కు ఈ కుట్రతో సంబంధాలున్నట్లు బీహార్ పోలీసులు గురువారం తెలిపారు. ఫుల్వారీ షరీఫ్ ప్రాంతం నుండి భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఇద్దరిని అరెస్టు చేశారు. జార్ఖండ్‌కు చెందిన రిటైర్డ్ పోలీసు అధికారి జల్లావుద్దీన్, స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమి) మాజీ సభ్యుడు, పిఎఫ్ఐ ప్రస్తుత సభ్యులు, సోషల్ డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు అథర్ పర్వేజ్ అరెస్టయ్యారని చెప్పారు. మోడీ బీహార్ పర్యటనకు 15 రోజుల ముందు అనుమానిత ఉగ్రవాదులు ఫుల్వారీ షరీఫ్‌లో శిక్షణ పొందారని, ఈ నెల 6, 7 తేదీల్లో మోడీ లక్ష్యంగా దాడులు జరిపేందుకు సమావేశమయ్యారని తెలిపారు.

భారత్‌లోనూ మంకీపాక్స్

- కేరళలో తొలికేసు గుర్తింపు

న్యూఢిల్లీ : ప్రపంచంలోని 59 దేశాల్లో విస్తరించిన మంకీపాక్స్ భారత్‌కూ పాకింది. కేరళలోని కొల్లాం జిల్లాలో తొలి కేసును గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిశాఖ గురువారం ప్రకటించింది. ప్రజారోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవడంలో కేరళ రాష్ట్ర ఆరోగ్య అధికారులకు సహకరించడానికి అత్యున్నత స్థాయి బృందాన్ని ఆ రాష్ట్రానికి పంపినట్లు తెలిపింది. కేరళ వెళ్లే బృందంలో నేషనల్ సెంటర్ ఆఫ్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి)కు చెందిన నిపుణులు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, కేరళ ప్రాంతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యాలయ నిపుణులు ఉంటారు. ఇటీవల యుఎఇ నుంచి తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో దిగిన వ్యక్తికి మంకీపాక్స్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ గురువారం తెలిపారు. బాధితుడు యుఎఇలో మంకీపాక్స్ సోకిన వ్యక్తితో సన్నిహితంగా మెలిగినట్లు మంత్రి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆరు వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. ముగ్గురు మరణించారు. ఐరోపా, ఆఫ్రికా దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తి అధికంగా ఉంది. మొత్తం కేసుల్లో 80శాతం మంది యూరప్ దేశాల నుంచి వచ్చినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన సంగతి తెలిసిందే.

అగాధంలోకి రూపాయి

- 1 డాలరు 80 రూపాయలు
- భారీగా మారకం విలువ పతనం
- మరోమారు రికార్డుస్థాయి పతనం

న్యూఢిల్లీ : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ తీవ్ర అగాధంలోకి పడిపోతోంది. ఇటీవలి కాలంలో వరుస రికార్డ్ పతనంతో గురువారం ఏకంగా డాలర్‌తో రూపాయి విలువ 80కి అత్యంత చేరువలోకి జారుకుంది. ఉదయం 79.72 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 79.92కు పతనమై.. తుదకు 79.88 వద్ద ముగిసింది. ఇంతక్రితం ట్రేడింగ్‌తో పోలిస్తే మరో 9 పైసలు విలువ కోల్పోయింది. ఇది రూపాయి చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం చోటు చేసుకుంటుందనే సంకేతాలతో ఇటీవల దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలను చవి చూస్తున్నాయి. ఇదే క్రమంలో విదేశీ సంస్థాగత మదుపర్లు భారీగా తమ ఈక్విటీలను తరలించుకుపోతున్నారు. మరోవైపు భారత ఎగుమతులు తగ్గడం, దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు రికార్డ్ స్థాయికి చేరుకుంటుంది. ఈ పరిణామాలు రూపాయి విలువను బలహీనపర్చుతున్నాయి.

మోడీకి వ్యతిరేకంగా వ్యంగ్య చిత్రం

- ఐదుగురిని అరెస్టు చేసిన యుపి పోలీసులు

న్యూఢిల్లీ : మోడీ పాలనలో నిరసనలు తెలపటానికీ పౌరులకు స్వేచ్ఛ ఉండటం లేదు. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లో తాజాగా చోటుచేసుకున్న ఒక ఘటనే దీనికి నిదర్శనం. మోడీకి వ్యతిరేకంగా ఒక వ్యంగ్య చిత్రాన్ని ప్రదర్శించినందుకు గానూ ఐదుగురిని ప్రయాగ్‌రాజ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒకరు ప్రింటింగ్ ప్రెస్ యజమాని కాగా, మరొకరు ఈవెంట్ నిర్వాహకుడు ఉన్నారు. ఈ ఐదుగురిని అనికేత్ కేసరి, అభయ్ కుమార్ సింగ్, రాజేశ్ కేసర్‌వానీ, శిశ్, నంకా అలియాస్ ధర్మేంద్రగా గుర్తించారు. నగరంలోని కలోనెల్‌గంజ్ ప్రాంతంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా హోర్డింగ్‌పై వ్యంగ్యచిత్రాన్ని ప్రదర్శించారు. పోరాటంలో అన్నదాతలు అసువులు బాసారనీ, కాంట్రాక్టు పనులతో యువత ఆశలను అడియాశలు చేశారనీ, ఇంధన ధరల పెరుగుదలపై కేంద్రం తీరును విమర్శిస్తూ అందులో ఉన్నది. ఈ హోర్డింగ్‌పై ఫిర్యాదు అందిన తర్వాత పోలీసులు కేసు నమోదు చేశారు. సిసి టీవీ ఫుటేజీ ఆధారంగా ఆ ఐదుగురిని పోలీసులు గుర్తించారు.

గుజరాత్‌లో కొనసాగుతున్న భారీ వర్షాలు

- పలు జాతీయ రహదారుల మూసివేత

అహ్మదాబాద్, ఢిల్లీ : గుజరాత్‌లోని నవ్‌సారి, వల్సాద్, దాంగ్స్ తదితర దక్షిణ జిల్లాల్లో గురువారం కూడా భారీ వర్షాలు ముంచెత్తాయి. అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వల్సాద్ సమీపంలో రహదారి మునిగిపోవడంతో అహ్మదాబాద్- ముంబయి జాతీయ రహదారిని అధికారులు మూసివేశారు. దీంతో పాటు రాష్ట్రంలో వందకుపైగా ఇతర రోడ్లను, హైవేలను కూడా మూసివేశారు. గురువారం తెల్లవారు జామున తాపి, వడోదర జిల్లాల్లో వరదల్లో చిక్కుకున్న 45 మందిని సహాయక సిబ్బంది రక్షించారు. రాష్ట్రంలో 30 రిజర్వాయర్లు 70 శాతం సామర్థ్యాన్ని దాటాయి.

ఎనిమిది రాష్ట్రాల్లో భారీ వర్షాలు

ఎనిమిది రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఢిల్లీలోని వాతావరణ కార్యాలయం అంచనా వేసింది. 22 నదీ ప్రాంతాల్లో హెచ్చరిక స్థాయి కంటే ఎక్కువ నీరు ప్రవహించడంతో వరద పరిస్థితి మరింత దిగజారుతుందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, బీహార్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర, అస్సాం, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో వరద పరిస్థితి నెలకొంది. మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లా వసాయ్ నగరంలో బుధవారం కొండచరియలు విరిగిపడి తండ్రీ కూతురు మరణించారు. గోండియా జిల్లాలో నలుగురు వరద నీటిలో కొట్టుకుపోయారు. భారీ వర్షాల కారణంగా నదులు ఉప్పొంగడం, డ్యామ్‌ల పూర్తిస్థాయి సామర్థ్యానికి సమానంగా నీరు చేరుకోవడంతో కోస్తా కర్ణాటక, మల్నాడులోని పలు ప్రాంతాలు వరదల లాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఒడిశాలోని కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, గజపతి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో పదిళ్లు దెబ్బతిన్నాయి.

ఎట్టకేలకు గొటబయా రాజీనామా

- సింగపూర్‌లో మలి మజిలీ
- అక్కడి నుంచే మెయిల్‌లో రాజీనామా

కొలంబో: దేశాన్ని దివాలా తీయించి, ప్రజల జీవితాలను బుగ్గిపాలు చేసిన ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేయడంతో దేశం వీడి పారిపోయిన శ్రీలంక అధ్యక్షుడు గొటబయా రాజపక్స ఎట్టకేలకు తన పదవికి రాజీనామా చేశారు. మాల్దీవుల్లో తొలి మజిలీ, సింగపూర్‌లో మలి మజిలీ వేసిన ఆయన గురువారం అక్కడి నుంచే తన రాజీనామా లేఖను పంపారు. అక్కడకు చేరుకున్న వెంటనే ఇ మెయిల్ ద్వారా తన రాజీనామా లేఖను స్పీకర్ అబె వర్ధనెకు పంపారు. అయితే ఇ మెయిల్ రూపంలో వున్న రాజీనామాను ఆమోదిస్తారా లేదా అనేది ఇంకా తెలియరాలేదు. ఇదిలా వుండగా, ప్రశాంతంగా వుండాల్సిందిగా సైన్యం ప్రజలను కోరుతోంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ప్రాణ, ఆస్తి నష్టం జరిగినా తగు చర్యలు తీసుకునే అధికారం తమకు ఉందని ఆర్మీ తెలిపింది. స్వదేశంలో ప్రజల తిరుగుబాటును తప్పించుకుని మాల్దీవులకు పారిపోయిన 33 గంటల తర్వాత గొటబయా ఆ దేశాన్ని కూడా వీడి సౌదీ ఎయిర్‌లైన్స్ విమానం ద్వారా సింగపూర్ చేరుకున్నారు. సింగపూర్ విదేశాగ శాఖ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. అటు నుంచి సౌదీ అరేబియాకు గొటబయా వెళ్తారని వార్తలొస్తున్నాయి.

ఇది వ్యక్తిగత పర్యటనే!

వ్యక్తిగత పర్యటన కిందే గొటబయాను తమ దేశంలోకి అనుమతించినట్లు సింగపూర్ ప్రభుత్వం తెలిపింది. 'ఆయన రాజకీయ శరణార్థిగాఆశ్రయం ఏమీ కోరలేదు. మేం ఆయనకు ఆశ్రయం ఇవ్వలేదు. సింగపూర్ సాధారణంగా ఆశ్రయం కోరే అభ్యర్థనలను అనుమతించదు.' అని పేర్కొంది. గొటబయా దేశం వీడి పారిపోవడానికి భారత ప్రభుత్వం సహకరించిందన్న వార్తలను మాల్దీవుల్లోని భారత హై కమిషన్ తోసిపుచ్చింది. లాంఛనంగా రాజీనామా అందకపోతే రాజపక్సా ఆ పదవిని ఖాళీ చేసే అవకాశాన్ని పరిశీలిస్తానని స్పీకర్ వ్యాఖ్యానించిన కొద్ది సేపటికే ఇ-మెయిల్ ద్వారా రాజీనామా లేఖ అందింది. రాజపక్సాకు ఆతిథ్యమివ్వాలన్న మాల్దీవుల ప్రభుత్వ నిర్ణయంపై మాల్దీవుల ప్రతిపక్షాలతో పాటు శ్రీలంక ప్రజలు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఆయనకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. దీంతో గొటబయా మాల్దీవులను వీడి సింగపూర్‌కు చేరారు. మొదట అమెరికా పారిపోయేందుకు యత్నించారు. అమెరికా వీసా ఇవ్వనిరాకరించడంతో ఆ యోచన విరమించుకున్నారు.

విక్రమ్ సింఘె తప్పుకో!

గొటబయాతోబాటు, విక్రమసింఘె కూడా తప్పుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. యుఎన్‌పి తరపున ఏకైక ఎంపీగా ఉన్న వికమ్ సింఘెను గొటబయా తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించారు.రాజపక్సెకు తొత్తుగా వ్యవహరిస్తూ, అధికారంపై యావతో దేశవ్యాపితంగా ఎమర్జెన్సీ విధించిన విక్రమ్ సింఘెపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. 'వారు దేశాన్ని అమ్మేశారు, మంచి వ్యక్తికి అధికారాన్ని అప్పగించే వరకు పోరాటాన్ని ఆపేది లేదు.' అని మాలిక్ పెరెరా అనే ఆందోళనకారుడు వ్యాఖ్యానించారు. గురువారం ఉదయానికి పార్లమెంట్ చుట్టుపక్కల ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. అక్కడకు దారి తీసే మార్గాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ప్రవేశ మార్గానికి ఎదురుగా గల పార్క్‌లో పలువురు ఆందోళనకారులు మకాం వేశారు. మరోవైపు నెమ్మదిగా సాధారణ జన జీవనం నెలకొంటోంది. చాలావరకు దుకాణాలు తెరిచారు. బుధవారం నాటి ఆందోళనలు, నిరసనల్లో ఒక వ్యక్తి మరణించగా, 84మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో నిలదీస్తాం

- కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ, లోక్‌సభ పక్షనేతలు మల్లికార్జున ఖర్గే, అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. గురువారం నాడిక్కడ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అధ్యక్షతన పార్లమెంటరీ వ్యూహ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున ఖర్గే, అధిర్ రంజన్ చౌదరి సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వంట గ్యాస్ ధర పెరుగుదల, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం, రూపాయి పతనం, ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ వంటి అంశాలను లేవనెత్తుతామని పేర్కొన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి, సమాఖ్య విధానంపై దాడి, మతోన్మాద ఉద్రిక్తతలు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. ఇండియా, చైనా సరిహద్దుల్లో పరిస్థితిని కూడా లేవనెత్తుతామని చెప్పారు. ఆదివారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశం తరువాత భావసారూప్యత గల ప్రతిపక్ష పార్టీల సమావేశం జరుగుతుందని తెలిపారు.

అక్టోబర్ 2కి ముందే కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర

అక్టోబర్ 2కి ముందే కాంగ్రెస్ భారత్ జోడో యాత్రను నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, భారత్ జోడో యాత్ర కన్వీనర్ దిగ్విజయ్ సింగ్ తెలిపారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో 148 రోజులపాటు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు సాగే ఈ యాత్ర 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల మీదుగా దాదాపు 3,500 కిలోమీటర్లు సాగుతుందని చెప్పారు. ప్రతిరోజూ 25 కిలోమీటర్లు యాత్ర సాగుతోంది. గురువారం నాడిక్కడ ఎఐసిసి కార్యాలయంలో ఎఐసిసి కార్యవర్గ సభ్యులు, పిసిసి అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలపై దాడులు తీవ్రమవుతునడంతో, మోడీ సర్కార్, బిజెపి సమాజాన్ని విభజిస్తోన్న నేపథ్యంలో భారత్ జోడో యాత్రను అక్టోబర్ 2 కంటే ముందుగానే ప్రారంభించే అవకాశాలున్నాయని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులకు, రాజ్యాంగాన్ని అందించిన వారందరికీ, విభజన రాజకీయాలను ఓడించిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ ఘనంగా నివాళు లర్పిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, ఉమెన్ చాందీ తదితరులు పాల్గొన్నారు. విదేశీ పర్యటనలో ఉండటంతో రాహుల్ గాంధీ ఈ సమావేశానికి హాజరు కాలేదు. భారత్ జోడో యాత్ర ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొనసాగుతుందని ఎపిసిసి అధ్యక్షుడు సాకే శైలజానాథ్ తెలిపారు. సోనియా గాంధీని ఇడి విచారణకు పిలవడాన్ని నిరసిస్తూ ఈ నెల 22న ఏపిలో అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. మక్తల్ వద్ద తెలంగాణలో యాత్ర ప్రవేశిస్తుందని, జుక్కల్ మీదుగా నాందేడ్‌కు కొనసాగుతుందని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలిపారు.

కెనడాలో గాంధీ విగ్రహం ధ్వంసం

- ఖండించిన భారత్

ఒట్టావా : కెనడాలో గాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. అంటారియోలోని రిచ్‌మండ్ హిల్ సిటీలోని యోంగే స్ట్రీట్, గార్డెన్ అవెన్యూ ప్రాంతంలోని విష్ణు మందిర్‌లో ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహాన్నిధ్వంసం చేసినట్లు యార్క్ ప్రాంతీయ పోలీసులు తెలిపారు. ఇది విద్వేషపూరిత చర్యగా పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణకు భారత్ గురువారం డిమాండ్ చేసింది. 'రిచ్‌మండ్ హిల్‌లోని విష్ణు దేవాలయం వద్ద మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల చింతిస్తున్నాం.ద్వేషపూరిత, నేరపూరిత విధ్వంసక చర్య కెనడాలోని నివసిస్తున్న భారతీయుల మనోభావాలను తీవ్రంగా గాయపర్చింది. ఈ ఘటనపై దర్యాప్తు జరిపేందుకు కెనడా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని టొరంటోలోని భారత కాన్సులేట్ జనరల్ తెలిపారు. ఒట్టావాలోని భారత రాయబార కార్యాలయం కూడా ఈ ఘటనను ఖండించింది.

మీ తప్పుడు ప్రచారం ఆపండి

బిజెపి పై మాజీ ఉపరాష్ట్రపతి హమిద్ అన్సారీ ఆగ్రహం



న్యూఢిల్లీ : పాకిస్తాన్ గూఢచారికి దేశ రహస్యాలు అందజేశారంటూ బిజెపి తనపై చేస్తున్న ఆరోపణలను మాజీ ఉపరాష్ట్రపతి హమిద్ అన్సారీ తీవ్రంగా ఖండించారు. బిజెపి ఆరోపణలను 'అబద్ధాల పుట్ట' అని అభివర్ణించారు. పాక్ గూడచారి సంస్థ ఐఎస్ఐకి ఏజెంట్‌గా పనిచేసే ఆ దేశ జర్నలిస్టు నుస్రత్ మీర్జాకు అన్సారీ కీలకమైన రహస్యాలు చేరవేశారని బిజెపి అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా బుధవారం ఆరోపించారు. తనపై బురద చల్లేందుకు బిజెపి ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తానెప్పుడూ మీర్జాను కలవలేదు. సమాచారాన్ని అందించలేదని ఆయన స్పష్టం చేశారు. 2010 డిసెంబరు 11న తీవ్రవాదంపై ఒక అంతర్జాతీయ సమావేశాన్ని తాను ప్రారంభించాను. ఇది సాధారణ ప్రక్రియ. ఆహ్వానితుల జాబితాను నిర్వాహకులే తయారు చేశారు. తాను ఎన్నడూ అతన్ని ఆహ్వానించడం కానీ, .కలుసుకోవడం కానీ చేయలేదని అన్నారు.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా విదేశీ ప్రముఖులకు ఉపరాష్ట్రపతి ఆహ్వానం అందజేస్తారని తెలిపారు. ఇరాన్‌లో భారత రాయబారిగా పనిచేస్తున్నప్పుడు కూడా దేశ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ప్రవర్తించానని బిజెపి చేసిన ఆరోపణలను అన్సారీ ఖండించారు. 'భారత ప్రభుత్వం వద్ద పూర్తి సమాచారం ఉంటుంది. ఇరాన్‌లో రాయబారిగా పనిచేసిన తరువాత ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత ప్రతినిధిగా ఎంపికయ్యాను. అక్కడ నేను చేసిన పనికి దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు వచ్చింది' అని అన్సారీ తెలిపారు. 2007 నుంచి 2017 వరకూ అన్సారీ భారత ఉపరాష్ట్రపతిగా పనిచేశారు.

ICICI Home Finance | కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అంధేరి -కుర్లా రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా

శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి, డా॥ ఎన్.వి. రమేష్ కాంప్లెక్స్, 13-1, 54, మెయిన్ రోడ్డు, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533001.

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖాపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/హామీదారులు/ చట్టబద్ధ వారసులు. లోను ఖాతా నం.	తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు, ఏవైనా	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర / బయానా మొత్తం	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	గణేష్ తులసీరామ్ గుప్తా యర్రమిల్లి (రుణగ్రహీత), మంగమణి పాబోలు (సహ-రుణగ్రహీత) లోను ఖాతా నం. NHKKN00001267561	తూర్పు గోదావరి జిల్లా-533001, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, ఉంగరాల వారి వీధి, డో.నెం. 21-1-53 ఎదురు, టి.ఎస్.నెం.90, మున్సిపల్ వార్డు నెం.14, బ్లాక్ నెం.20, పాత మూల్యాంకనం నెం. 10-4614, కొత్త మూల్యాంకనం నెం. 1060029620 తో సరిహద్దులు: తూర్పు: సరోవర్ పోర్టికో హోటల్ భవనం, పడమర: 20 ఫీట్స్ వెడల్పు రోడ్డు, ఉత్తరం: మంగమని పాబోలుకు చెందిన సైట్, దక్షిణం: పైడా హైట్స్ భవనం.	రూ. 1,26,55,174/- (9-జులై-2022 నాటికి)	Rs. 1,17,00,000/- / Rs.11,70,000/-	25th July, 2022 11:00AM-03:00PM	30th July, 2022 11:00-12:00PM
2.	మంగమణి పాబోలు (రుణగ్రహీత), తులసీరాం గుప్తా యర్రమిల్లి (సహ-రుణగ్రహీత) లోను ఖాతా నం.: NHKKN00001267563	తూర్పు గోదావరి జిల్లా-533001, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, ఉంగరాల వారి వీధి, డో.నెం.21-1-53 ఎదురు, టి.ఎస్.నెం.90, మున్సిపల్ వార్డు నెం.14, బ్లాక్ నెం.20, పాత మూల్యాంకనం నెం. 10-4614, కొత్త మూల్యాంకనం నెం.1060029620తో సరిహద్దులు: తూర్పు: సరోవర్ పోర్టికో హోటల్ భవనం, పడమర: 20 ఫీట్స్ వెడల్పు రోడ్డు, ఉత్తరం: పైడా కృష్ణారావుకు చెందిన సైట్, దక్షిణం: యర్రమిల్లి గణేష్ తులసీరాం గుప్తాకు చెందిన సైట్.	రూ. 1,24,06,669/- (9-జులై-2022 నాటికి)	Rs. 1,17,00,000/- / Rs.11,70,000/-	25th July, 2022 11:00AM-03:00PM	30th July, 2022 11:00-12:00PM

మా వేలం ఏజెన్సీ ఆక్షన్ టైగర్ వెబ్‌సైట్ (URL Link-https://sarfaesi.auctiontiger.net/EPROC) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. జులై 29, 2022న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖాదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.
కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి, డా॥ ఎన్. వి. రమేష్ కాంప్లెక్స్, 13-1, 54, మెయిన్ రోడ్డు, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533001 లేదా జులై 29, 2022న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి, డా॥ ఎన్. వి. రమేష్ కాంప్లెక్స్, 13-1, 54, మెయిన్ రోడ్డు, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533001 లేదా జులై 29, 2022న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి విజయవాడ వద్ద చెల్లించాలి.
తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి. అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరణాత్మక నియమాలు మరియు షరతులు, https://www.icicihfc.com/ దయచేసి చూడండి..

తేది: జులై 15, 2022,
ప్రదేశం: తూర్పు గోదావరి.

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్